క్లుప్తంగా

ఎమ్మెల్యే అంజిబాబును కలిసిన మంత్రి నిమ్మల



ఎమ్మెల్యే అంజిబాబుతో మంత్రి రామానాయుడు

భీమవరం: రాష్ట్రమంత్రివర్గంలో స్థానం పొందిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గురువారం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంజిబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), టీడీపి రాష్ట్ర పొలిట్‌బ్యూరోసభ్యురాలు తోట సీతా రామలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రామానాయుడు వెంట మాజీ ఎమ్మెల్సీ అంగరరామ్మోహన్, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తదితరులున్నారు.

అనారోగ్యంతో రైస్ మిల్లర్ మృతి



నాగులపల్లి వీరాస్వామి (ఫైల్)

ఆకివీడు: స్థానిక రైస్ మిల్లర్ నాగులపల్లి వీరాస్వామి(83) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పంచాయతీ వార్డు సభ్యుడిగా పని చేసిన వీరాస్వామి, రైస్ మిల్లు కాంట్రాక్టర్‌గా రాష్ట్ర వ్యాప్తంగా 200 పైగా రెస్ మిల్లులను నిర్మించి రైస్ మిల్లు ఓనర్‌గా ఎదిగారు. ఆయన మృతి పట్ల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు చుండూరి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, కౌన్సిలర్ గేదల అప్పారావు సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని ఏవీఆర్ నగర్‌లో నిర్మించిన సంపత్ వినాయక ఆలయం మూడవ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు యేడిద నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో లక్ష్మీ గణపతి హోమం, అనంతరం సిద్ధి బుద్ధి సమేత సంపత్ గణపతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అఖండ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం దేవేరులను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు. రాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన అడబాల వెంకట ఖాశీ ప్రసాద్, శంకర పార్వతి దంపతులు పీటలపై కూర్చుని ఈ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కొమ్మిరెడ్డి ఉదయ భాస్కరరావు, పిల్ల పద్మారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: పేద విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు కూడా సహాయ సహకారాలు అందించి విద్యార్థుల విద్యా ప్రగతికి దోహదపడాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు విద్యార్థులకు రెండు సైకిళ్లను అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో వాకర్స్ క్లబ్ ముందుంటుందని అన్నారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామూర్తి పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు సెంట్రల్: విశ్వమానవ వేదిక వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్న సానబోయిన భవాని (70) గురువారం మృతి చెందింది. ఆమెకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో విశ్వమావన వేదిక చైర్మన్ మల్లుల సురేష్ అతని మిత్ర బృందం పాలకొల్లులో శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. భవాని గత కొంతకాలం నుంచి వృద్ధాశ్రమంలోనే ఉంటోందని, కనీసం ఆధార్ కార్డు కూడా ఆమెకు లేదని సురేష్ తెలిపారు. అనారోగ్యంగా ఉండడంతో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారన్నారు. గుంపుల రవి, డా.మల్లుల జ్ఞానేశ్వరి, కోళ్ల సింహాద్రి అంత్యక్రియలు నిర్వహించారు.

అపుస్మా జోన్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జోన్ ప్రెసిడెంట్‌గా గురుకుల విద్యాలయ చైర్మన్ గొర్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక దీప్తి హైస్కూల్ ఆవరణలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలకొల్లు జోన్ కార్యదర్శిగా మానేపల్లి శ్రీరామ్, కోశాధికారిగా అందే భాను ప్రకాష్, ఉపాధ్యక్షులుగా వజ్జిపర్తి సాయిబాబు, అడబాల శ్రీమన్నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా మేడపాటి జానకిరామ్, మోదిని పద్మిని ఎన్నికయ్యారు. నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన గొర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జోన్ పరిధిలో ఉన్న పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లో సుమారు 50 ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ

- రక్తదానంలో హోప్ ఛారిటబుల్ ట్రస్టు ముందంజ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



యువత నుంచి రక్తం సేకరిస్తున్న హోప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు



హోప్ ద్వారా రక్తం పొందుతున్న తలసేమియా చిన్నారులు

ఆకివీడు: ప్రతి రక్తపు బొట్టూ మనిషి ప్రాణాల్ని నిలుపుతుంది. ఆపదలో ఉన్న వారికి, గర్భిణులు, ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసరమయ్యేది రక్తం. ఇటీవల తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య పెరిగిపోతుంది. కరోనా మొదటి వేవ్‌లో రక్తం అందక చాలా మంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆసుపత్రుల్లో రక్తం కోసం ఎదురు చూసి ప్రాణాలు వదిలిన సంఘటనలూ ఉన్నాయి. గర్భిణీలు సైతం ఈ దుస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు ట్రస్టుగా ఏర్పడి హోప్ అనే రక్త దాన సంస్థను ఏర్పాటు చేశారు.

15,500 మందికి రక్త దానం

గత నాలుగేళ్లుగా ట్రస్టు ద్వారా వివిధ ప్రాంతాల్లో 100కు పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్త దాతలు ద్వారా రక్తాన్ని సేకరించి, 15,500 మందికి రక్త దానం చేశారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాల్ని కాపాడారు. కరోనా సమయంలో హోప్ సభ్యులు అందించిన సేవా కార్యక్రమాలతో ఎంతో మంది ప్రాణాలతో బయటపడ్డారు.

తలసేమియా రోగులకు తోడుగా...

తలసేమియా వ్యాధితో బాధపడుతోన్న చిన్నారులకు తోడుగా హోప్ ఉంది. వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతీ 15 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. భీమవరం, ఆకివీడు, ఉండి, కైకలూరు, కలిదిండి, పాలకొల్లు, నరసాపురం, తణుకు ప్రాంతాల్లోని తలసేమియా చిన్నారులు 35 మందికి ప్రతీ 15 రోజులకోసారి రక్తం అందజేస్తూ వారిని ఆపద నుంచి కాపాడుతోంది. గత రెండు సంవత్సరాల క్రితం నుంచి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో డెంగ్యూ వ్యాధికి గురై ప్లేట్‌లెట్స్ తగ్గి ఇబ్బంది పడుతున్న వారికి హోప్ సంస్థ అండగా నిలిచింది. ప్లేట్‌లెట్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి, వేలాది మంది నుంచి ప్లేట్‌లెట్స్ సేకరించి, రోగులకు అందజేశారు. క్యాన్సర్ రోగులకు కూడా రక్తదానంచేసి ఆదుకున్న సంఘటనలున్నాయి. నిండు ప్రాణాల్ని కాపాడటానికి రక్తదానం చేద్దాం, నిండు ప్రాణాల్ని కాపాడుదాం అంటూ తమ సంస్థ ప్రజల్లో అవగాహన కల్పిస్తోందని హోప్ ట్రస్ట్ ప్రతినిధి నూకల శివ తెలిపారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా దాని విశిష్టతను, సంస్థ ద్వారా చేసిన రక్త దాన వివరాల్ని ఆయన 'సాక్షి'కి వివరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహనతో ఉండాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వాతావరణ మార్పులతో అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయని, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని దుర్గాపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యుడు డా జెరూషా అన్నారు. పట్టణంలోని దుర్గపురం ఆరోగ్య కేంద్రం నుంచి సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరమంటూ లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెరూశా మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు విజృంభిస్తాయని, తద్వారా అంతుపట్టని రోగాలతో సమాజం అనారోగ్యంగా ఉంటుందని అన్నారు. దోమకాటు ప్రమాదకరమని, స్లామ్ ఏరియాలో పరిశుభ్రత అవసరమని, ఆరోగ్య కేంద్రాలు ఎన్ని ఉన్నా పరిసరాలు శుభ్రంగా లేకుంటే అనారోగ్యమేనని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని అన్నారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, రోటరీ క్లబ్ సభ్యులు షేక్ బాబాజీ సాహెబ్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెచ్‌వీ పి.జయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ కె.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ దుస్తులతో దర్జీలకు తగ్గుతున్న ఆదరణ



భీమవరంలో జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: రెడీమేడ్ వస్త్రాల వ్యవస్థలతో దర్జీ వృత్తికి క్రమేణా మసకబారుతోందని గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం కుట్టు శిక్షణ ఉపాధ్యాయిని దుర్గ రత్నమాల అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రంలో గురువారం జాతీయ కుట్టు యంత్రం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం శుభకార్యాలు, పండుగలు వస్తున్నాయంటే దర్జీలకు చేతినిండా పని ఉండేదని, పల్లెల్లో పట్టణాల్లో దర్జీలను ఎంతో ఆదరించేవారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన ఆదర్శ మహిళా సంఘాల్లో భీమవరం గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం ఒకటని ఇక్కడ పదిహేనేళ్లుగా కుట్టు శిక్షణ అందిస్తున్నారన్నారు. అనంతరం భీమవరం పట్టణ ట్రైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శివకవి సాంబమూర్తి, కార్యదర్శులు త్రినాథ్, ఎస్ రామకోటేశ్వరరావు, దుర్గ రత్నమాల తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: రైతులు ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ దాళ్వా మాసూళ్ళ సొమ్ము రైతులకు రూ. 900 కోట్లు చెల్లించాల్సి ఉందని గత సార్వా సొమ్ములు కూడా బకాయిలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం విక్రయించిన సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు నెలల తరబడి ధాన్యం సొమ్ము అందక బయట వడ్డీలకు అప్పులకు తెచ్చి సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిల సొమ్మును వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సార్వాసాగుకు సాగునీటి కొరత లేకుండా జిల్లా యంత్రాంగం, ఇరిగేషన్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శివారు భూములకు సైతం నీరు అందేలా చూడాలని బలరామ్ డిమాండ్ చేశారు. విత్తనాలు పూర్తిగా సబ్సీడిపై అందించాలని కోరారు. సమావేశంలో జేఎన్‌వీ గోపాలన్ పాల్గొన్నారు.

చింతాడ చేరికతో టీడీపీలో వ్యతిరేకత

భీమవరం: అఖిల భారత దోభిమహా సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు, భీమవరం పట్టణ రజకసంఘం అధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్‌ను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడంతో భీమవరం పట్టణంలోని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం విజయవాడలో జరిగిన నూతన మంత్రి వర్గ ప్రమాణస్వీకారం అనంతరం శ్రీనివాస్‌కు పాలకొల్లు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు తెలుగుదేశం పార్టీ కండువావేసి ఆహ్వానించిన విషయం మీడియాలో ప్రసారం కావడంతో మంత్రి రామానాయుడుపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. గడిచిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోకి రాగానే పార్టీలో చేరడానికి వస్తే ఎలా చేర్చుకుంటారు? అని ప్రశ్నిస్తున్నారు. భీమవరం పట్టణంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలను సంప్రదించకుండా ఇతర పార్టీల నాయకులను ఇష్టానుసారం చేర్చుకుంటే స్థానికంగా మా పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ చదువుతున్న విద్యార్థి అదృశ్యం

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన శృంగవరపు తులసీ రవిశంకర్ ఈ నెల 11 నుంచి కన్పించడం లేదుంటు ఫిర్యాదు అందినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వై వెంకటేశ్వరరావు చెప్పారు. తులసీరవిశంకర్ పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగిరాకపోవడంతో బంధువులు ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శివశంకర్ తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు చెప్పారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకులో మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బ్యాగులు కుట్టుకుని జీవనోపాధి పొందుతున్న మహిళకు తణుకు మానవత సంస్థ రూ. 11 వేల విలువైన కుట్టు మిషన్‌ను బహూకరించారు. గురువారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యురాలు వంగూరి సుశీల ఆర్థిక సహాయంతో తణుకు పట్టణంలోని మసీదు వద్ద బ్యాగులు కుట్టుకుని జీవిస్తున్న షేక్ ఆస్కరీ జహాన్‌కు మానవత సంస్థ సభ్యురాలు వంగూరి సుశీల ఆర్థిక సహాయంతో బ్యాగులు కుట్టే మిషన్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, తణుకు శాఖ అధ్యక్షుడు ఏ బాలాజీ, కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, ఉపాధ్యక్షురాలు కఠారి శారదాదేవి, వంగూరి హనుమంతరావు, విశ్వనాథ రాజు, పాతూరి శివనారాయణ, రామకృష్ణంరాజు, బీ రామకాశీ, పులమాల వీరభద్రం, కేవీ రమణమూర్తి, పోతుల శ్రీనివాసు, అక్కిన కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. గురువారం పాఠశాల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు స్థానిక పానకాల రాయ రామ మోహన్ క్లబ్ సభ్యులు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గాదె సత్యనారాయణ, మామిడి బాబు, చోడిశెట్టి జ్ఞానశంకర్, ఎమ్మెస్ కోఆర్డినేటర్ పి జనార్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షా ఫలితాలు

భీమవరం: జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షా ఫలితాలు తమ కార్యాలయంలో, లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ జి.నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డ్‌లు త్వరలోనే సంబంధిత ఉప విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరతాయన్నారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నియమాల ప్రకారం ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతాతో తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకుని విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే అకౌంటుకు సీడ్ చేయించాలని సూచించారు. విద్యార్థుల కోసం త్వరలో జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ తెరువనుందని, ఆ సమయంలో విద్యార్థులు నమోదు చేసుకోడానికి విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ లిస్ట్ కార్డులో ఉన్న విధంగా ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ లోనూ ఒకేవిధంగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని డీఈవో నాగమణి సూచించారు.

ద్విచక్ర వాహనాల చోరీపై ఫిర్యాదులు

ఉండి: ఉండి మండలం వాండ్రం పరిధిలోని ఓ ఆక్వా రొయ్యల ఫ్యాక్టరీ వద్ద మూడు ద్విచక్రవాహనాల చోరీపై ఉండి పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాండ్రం గ్రామానికి చెందిన చింతపల్లి దుర్గామహేష్ అనే వ్యక్తి వెల్కం ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మేనెల 7వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఫ్యాక్టరీకి వెళ్లి తన ద్విచక్రవాహనాన్ని ఫ్యాక్టరీ వద్ద పార్కింగ్ చేసి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో వచ్చి చూస్తే తన వాహనం కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేడంతో ఎస్ఐ ఎం. లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. అదేవిధంగా వాండ్రం గ్రామానికి చెందిన మంతెన ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి వెల్కం ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు డ్యూటీకి వెళ్లి తన ద్విచక్ర వాహనాన్ని ఫ్యాక్టరీ వద్ద పార్కింగ్ చేశాడు. తిరిగి రాత్రి 9 గంటలకు బయటకు వచ్చి చూస్తే తన ద్విచక్రవాహనం కనిపించక పోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఏఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కాళ్ళ మండలం జక్కరం గ్రామ నివాసి అయిన ఓమన్ కట్టాన్ అనే వ్యక్తి వెల్కం ఆక్వా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇతను ఈ నెల 12వ తేదీ బుధవారం సాయంత్రం 3 గంటలకు తన ద్విచక్రవాహనంపై డ్యూటీకి వెళ్లి ఫ్యాక్టరీ వద్ద పార్కింగ్ చేసి డ్యూటీకి వెళ్లాడు.సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చి చూడగా తన ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు వాహనదారుడు కట్టాన్ ఫిర్యాదు చేశాడు.అతని ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చినపేటకు చెందిన రెడ్డి త్రినాథ్ కన్పించడం లేదని అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ రామకృష్ణ గురువారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 6న త్రినాథ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరక్క పోవడంతో త్రినాథ్ కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు.

మొదటి రోజు 70 శాతం హాజరు

భీమవరం అర్బన్: మండలంలోని పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమైనట్లు మండల విద్యాశాఖాధికారి వేండ్ర వెంకటేశ్వరరావు తెలిపారు. మొదటి రోజు భీమవరం మండలం, అర్బన్‌లలో 119 పాఠశాలలు ఉండగా 70 విద్యార్థులు హాజరయ్యారన్నారు. వేసవి సెలవులు అనంతరం జూన్ 12 పాఠశాలలు పునః ప్రారంభం కావాల్సి ఉండగా నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా జూన్ 13న పాఠశాలలు పునః ప్రారంభించినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో 100 శాతం విద్యార్థులు హాజరవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వంద రోజులు ఉపాధి పనులు చూపాలి



నడిపూడిలో ఉపాధి పనులు చూపాలని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పనిలేని రోజుల్లో ఉపాదిని చూపించే విధంగా తీసుకు వచ్చిన ఉపాధి చట్టాన్ని అమలు చేసి, వందరోజులు పని చూపాలని సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ మండలంలోని వ్యవసాయ కార్మిక సంఘంతో కలిసి పలు గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు. పని కావాలని అడిగే వారికి పనులు చూపడం లేదని వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. 20 రోజులు మాత్రమే చేశామని చెబుతున్నారన్నారు. చేసిన పనికి ప్రభుత్వం రూ.300 నిర్ణయించినా, రూ.200 నుంచి రూ.250 మాత్రమే పడుతున్నాయని కార్మికులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

యలమంచిలిలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీ



యలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

యలమంచిలి: మూడేళ్లుదాటిన పిల్లలు అందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ పిలుస్తోంది పేరిట గురువారం యలమంచిలిలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పిల్లల సమగ్ర ఎదుగుదలకు అవసరమైన ఆహారంతో పాటు బాల్యంలోనే మంచి నడవడిక అలవాటు అవ్వాలంటే పిల్లలు అందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కేవీడీ మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి, మహిళా పోలీస్ ఎం.స్నేహ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏలూరు రోడ్డులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో జేష్టమాసం సప్తమి గురువారం సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత గణపతి పూజ, అనంతరం సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో అభిషేకాలు జరిగాయి. ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు దంపతులు, పేరూరి కాశియ్య దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

వ్యవసాయం, పౌల్ట్రీ రంగాలకు అండగా నిలబడ్డాం



తణుకులో ట్రాఫిక్ బారికేడ్లు ప్రారంభిస్తున్న సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ తదితరులు

తణుకు అర్బన్: ఖాతాదారులకు సత్వర సేవలందించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను సెంట్రల్ బ్యాంకు ముందువరసలోనే ఉందని సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ అన్నారు. గురువారం తణుకు సెంట్రల్ బ్యాంకును పరిశీలించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడేళ్ల కాలంలో సెంట్రల్ బ్యాంకు సేవలు, వ్యాపారంలో మంచి పురోగతి సాధించినట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు సంబంధించిన జోనల్‌లో 7 రీజియన్‌లలోను 336 బ్రాంచ్‌లు ఉన్నాయని, ఇందులో భాగంగా విజయవాడ రీజియన్‌లో తమ బ్యాంకులు మంచి గ్రోత్ సాధించాయని రూ. 4,500 కోట్లు వ్యాపారం చేశామని స్పష్టం చేశారు. డిపాజిట్‌లు తక్కువగా సేకరించినప్పటికీ వ్యవసాయం ఇతర రంగాలకు అధికశాతం రుణాలు అందించి నూటికి 216 రేషియోలో సేవలందిస్తున్నామని చెప్పారు. తణుకు బ్రాంచ్ అన్ని రకాల బ్యాంకు విధుల్లోను ముందువరసలో ఉండగా ఈ శాఖలో 275 కోట్లు వ్యాపారం జరిగిందని అందులో ముఖ్యంగా వ్యవసాయం, పౌల్ట్రీలకు సంబంధించి 60 శాతం వరకు రుణాలు అందజేశామని చెప్పారు. అంతేకాకుండా రైస్ మిల్లర్స్, గోల్డ్ లోన్స్ ద్వారా ఖాతాదారులకు అండగా నిలిచినట్లు స్పష్టం చేశారు. పౌల్ట్రీ రంగంలో ఇటీవల సంభవించిన నష్టాలకు అనుగుణంగా రైతాంగానికి సెంట్రల్ బ్యాంకు పూర్తి సహకారం అందజేశామని తెలిపారు. మా బ్యాంకుపై ఎటువంటి ఫిర్యాదులు, సలహాలు ఇవ్వాలన్నా ఖాతాదారులు, ప్రజానీకం 18003030 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ వేగ నియంత్రణ బోర్డులు అందచేత

సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో భాగంగా సెంట్రల్ బ్యాంక్ అందచేసిన సహకారం అభినందనీయమని తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. తణుకు సెంట్రల్ బ్యాంక్ యాజమాన్యం సౌజన్యంతో సమకూర్చిన వేగనియంత్రణ, ట్రాఫిక్ డైవర్షన్ తదితర అవసరాలకు ఉపయోగించే 15 బారికేడ్స్ బోర్డులు సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ చేతులమీదుగా సీఐ నాగేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సేవలు అందించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను సెంట్రల్ బ్యాంకు ముందుండడం మంచి పరిణామమన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లు చాలా సద్వినియోగపడతాయని అన్నారు. తణుకు బ్రాంచి మేనేజరు వి.ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయవాడ రీజియన్ హెడ్ పి.సతీష్‌బాబు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.